సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 29 । జూలై । 2025



ఆరోగ్యశ్రీపై నీలినీడలు 8లో



16 ఏళ్ల కుర్రోడు.. సత్తాచాటాడు 8లో



కార్మిక హక్కుల రక్షణకు పోరాటాలు 8లో

న్యూస్‌రీల్

రెండు రోజుల్లో పీ-4 మార్గదర్శుల మ్యాపింగ్ పూర్తి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : రెండు రోజుల్లో పీ-4 మార్గదర్శుల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సేవకులు, ఇతర వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారిని గుర్తించి బంగారు కుటుంబాలకు మ్యాపింగ్ చేయాలని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో పీ-4పై అధికారులతో సమీక్షించారు. సమాజంలో ఎగువ స్థాయిలో ఉన్న వారంతా, దిగువ స్థాయిలో ఉన్నవారిని దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. గతంలో ప్రజల నుంచి వచ్చిన వినతులు, పరిష్కారం తీరు గురించి ఆరా తీశారు. ప్రజలు సంతృప్తి చెందే విధంగా అధికారులు వ్యవహరించాలని, ఫిర్యాదులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. రోజుకో గంట పీజీఆర్ఎస్ కోసం కేటాయించాలని, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో మనసు పెట్టి పనిచేయాలని హితవు పలికారు. ఆయనతో పాటు జేసీ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కిరండూల్ రైళ్లు గమ్యం కుదింపు



తాటిచెట్లపాలెం: కోరాపుట్-మల్లిగుడ-జరాటి స్టేషన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖలో మంగళవారం రాత్రి బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో మంగళ, బుధవారాల్లో కిరండూల్-విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరుతుంది. విశాఖలో మంగళ, బుధవారాల్లో బయల్దేరే విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో మంగళ, బుధవారాల్లో కిరండూల్-విశాఖపట్నం (58502) పాసింజర్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరుతుంది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సంబల్‌పూర్-నాందేడ్ (20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో నాందేడ్-సంబల్‌పూర్ (20810)ఎక్స్‌ప్రెస్ కు ఆగస్టు 2 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు. విశాఖ-గుణుపూర్-విశాఖ (58505/06) పాసింజర్‌లకు ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు. విశాఖ-కిరండూల్ (58501) పాసింజర్‌కు ఆగస్టు 1 నుంచి 31వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ(58502) పాసింజర్‌కు ఆగస్టు 2వ తేదీ నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.

కలెక్టరేట్‌కు క్యూ కట్టిన తల్లులు

తల్లికి వందనం అందలేదని ఫిర్యాదు

మహారాణిపేట : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తల్లులు క్యూ కట్టారు. తల్లికి వందనం డబ్బులు తమకు రాలేదంటూ సుమారు 60 మంది తల్లులు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు ఫిర్యాదులు చేశారు. తాము అన్ని విధాలా అర్హులమైనా డబ్బులు ఎందుకు రాలేదో తెలియడం లేదని కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఒక పిల్లాడికి ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీటు వస్తే ఇంకో విద్యార్థికి తల్లికి వందనం ఆపేశారని వాపోయారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత సీట్లు కేటాయించినప్పటికీ వారికి అమ్మఒడిని అమలు చేశారని.. కూటమి ప్రభుత్వం మాత్రం అర్హుల సంఖ్య తగ్గించే విధంగా ఇలా సరికొత్త నిబంధనలను తీసుకొని వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత సీటు రాని వారికి కూడా ఉచిత సీటు వచ్చిందని ఆన్‌లైన్‌లో చూపించి పథకం నిలుపుదల చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న డీఈవో, ఉప డీఈవో, సమగ్ర శిక్ష అధికారులకు ఈ ఫిర్యాదులను పరిశీలించమని పంపించారు.

చెన్నై To విశాఖ!

మద్యం మాఫియా



సాధారణ మద్యాన్ని ఖరీదైన బ్రాండ్ మద్యం సీసాల్లో నింపి రవాణా

నకిలీ మద్యం సరఫరాలో ఆరితేరిన వెంకటేష్ పిళ్లై బృందం

- ఖరీదైన ఖాళీ మద్యం సీసాల్లో పాండిచ్చేరి మద్యం నింపుతున్న చెన్నై ముఠా
- చెన్నై గ్యాంగ్‌తో అక్కయ్యపాలెంకు చెందిన పిళ్లై బృందం చెట్టాపట్టాల్
- డిఫెన్స్ మద్యం పేరుతో విశాఖకు తరలిస్తూ అధిక ధరకు విక్రయం
- పోలీసులకు చిక్కిన వెంకటేష్ పిళ్లై, చెన్నై ముఠాలోని మరో ఇద్దరు..

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

1000 ఎంఎల్.. ఫుల్ బాటిల్.. అంటే మద్యం ప్రియులకు పండగే. అందులోనూ డిఫెన్స్ బాటిల్ అంటే ఎంత ధర అయినా కొనుగోలు చేద్దామనే ఆలోచన!. ఇంట్లో పార్టీ ఉన్నా.. పండగ ఉన్నా... ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తే డిఫెన్స్ బాటిల్ ఇచ్చి ఖుషీ చేద్దామనుకుంటారు.. సరిగ్గా దీన్నే పక్కాగా క్యాష్ చేసుకుంటోంది అక్కయ్యపాలెంకు చెందిన వెంకటేష్ పిళ్లై టీం. చెన్నైలోని బర్మాకాలనీకి చెందిన ఓ టీం ఖరీదైన బ్రాండ్ మద్యం ఖాళీ సీసాలను సేకరించి.. అందులో మామూలు బ్రాండ్ మద్యాన్ని నింపి.. ఖరీదైన మద్యంగా సరఫరా చేస్తోంది. వీరితో సంబంధాలు నెరుపుకుంటూ అక్కడ నుంచి మద్యాన్ని దిగుమతి చేసుకుంటూ విశాఖలో డిఫెన్స్ మద్యం పేరుతో విక్రయించి భారీగా దండుకుంటోంది వెంకటేష్ పిళ్లై బృందం. చెన్నై నుంచి ట్రావెల్స్ ద్వారా ఈ మద్యాన్ని తరలిస్తుండడం విశేషం. లావాదేవీలన్నీ ఫోన్ పే, బ్యాంక్ అకౌంట్ల ద్వారా నిర్వహిస్తుండటం గమనార్హం. ఇందులో ఇప్పటికే చెన్నైకు చెందిన ముగ్గురిలో ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వెంకటేష్ పిళ్లైను కూడా అరెస్టు చేసి జైలుకు తరలించారు. లోతుగా విచారించేందుకు నేటి నుంచి వెంకటేష్ పిళ్లైను ఎక్సైజ్ పోలీసులు కస్టడీలోకి తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

బాటిలింగ్ యూనిట్ ఏర్పాటుచేసుకొని..

చెన్నైలోని బర్మా కాలనీకి చెందిన ముఠా సభ్యులు పలు ప్రాంతాల నుంచి ఖరీదైన బ్రాండ్ మద్యం ఖాళీ సీసాలను సేకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపుగా అన్ని జిల్లాల నుంచి ప్రీమియం బ్రాండ్ ఖాళీ సీసాలను అక్కడకు తరలిస్తున్నారు. అనంతరం పాండిచ్చేరి నుంచి తక్కువ ధరకు లభించే మద్యాన్ని (సాధారణ ఇతర బ్రాండ్లు) తీసుకొచ్చి ఈ ఖాళీ సీసాల్లో నింపేస్తున్నారు. ఇందుకోసం బాటిలింగ్ యూనిట్‌ను అక్కడ ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. అనంతరం ఆర్డర్లకు అనుగుణంగా ఆయా ప్రాంతాలకు వీటిని తరలిస్తున్నారు. తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన వెంకటేష్ పిళ్లై.. ఈ ముఠాతో సంబంధాలు ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి ఈ మద్యాన్ని ఇక్కడకు తరలిస్తున్నారు. అయితే వెంకటేష్ పిళ్లై గత 20 సంవత్సరాలుగా అక్కయ్యపాలెంలోనే నివాసం ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డారు. అంతేకాకుండా అక్కడి నుంచి నకిలీ మద్యాన్ని తెచ్చిన తర్వాత.. కొన్నింటిలో నీటిని కూడా నింపి యథావిధిగా సీల్ వేసి విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది.

ఫోన్ పే, బ్యాంక్ అకౌంట్ల ద్వారానే లావాదేవీలు

కోయంబత్తూరు నుంచి విశాఖకు 20 ఏళ్ల క్రితం వచ్చిన వెంకటేష్ పిళ్లై మొదటి నుంచీ ఈ నకిలీ మద్యం సరఫరాలో ఆరితేరారు. గతంలోనూ ఇతనిపై పలుమార్లు కేసులు నమోదయ్యాయి. చెన్నైకు చెందిన ఇషాక్, మహమ్మద్ నిస్సార్ అహమ్మద్‌తో పాటు మహమ్మద్ సాధిక్ బాషా ఒకే కుటుంబానికి చెందినవారు. వీరు ఏపీలోని దాదాపు అన్ని జిల్లాల నుంచి ఖరీదైన మద్యం ఖాళీ సీసాలను సేకరిస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఈ వ్యాపారం చేసే వారితో సంబంధాలు పెట్టుకుని.. చెన్నైలోని బర్మా కాలనీకి చెందిన తమకే విక్రయించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. అక్కడి నుంచి ఖరీదైన మద్యం పేరుతో నింపిన బాటిల్స్‌ను తమకు వచ్చే ఆర్డర్లకు అనుగుణంగా ట్రావెల్స్ ద్వారా తరలిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఆర్డర్లకు అనుగుణంగా తమకు రావాల్సిన మొత్తాన్ని ఫోన్ పే, బ్యాంక్ అకౌంట్ల ద్వారానే లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

రూ.వెయ్యి తగ్గించామని కలరింగ్ ఇస్తూ..

1000 ఎంఎల్ బాటిల్‌ను రూ.500కే తయారుచేస్తున్న ఈ ముఠా రూ.4 వేలు చొప్పున విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. అంతిమంగా బయట మార్కెట్‌లో రూ.5 వేల విలువ చేసే బాటిల్‌ను రూ.4 వేలకే విక్రయిస్తున్నామంటూ నకిలీ మద్యాన్ని ఖరీదైన మద్యంగా అంటగడుతున్నారు. బయటి మార్కెట్ కంటే రూ.వెయ్యి ధర తగ్గడమే కాకుండా.. అంత సులువుగా దొరకని డిఫెన్స్ మద్యం తమకు వస్తోందని భావిస్తున్న కొందరు వెంకటేష్ పిళ్లై నుంచి ఆర్డర్లు పెట్టి మరీ తీసుకుంటుండటం గమనార్హం. తాజాగా అక్కయ్యపాలెంలో పట్టుబడిన ఈ మద్యాన్ని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపగా.. ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే పదార్థాలు కూడా ఇందులో కలిసి ఉన్నట్టు ల్యాబ్ నివేదికలో తేలింది. ఇందులో పాండిచ్చేరి మద్యంతో పాటు ఇంకా ఏమైనా రసాయనాలు కలుపుతున్నారా? అనేది కూడా తేలాల్సి ఉంది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనే ఆస్తి పన్ను పేరు మార్పు

- ఆగస్టు 1 నుంచి ప్రక్రియ ప్రారంభం
- ఆస్తి పన్ను పేరు మార్పుకై జీవీఎంసీకి దరఖాస్తు చేయక్కర్లేదు
- అదనపు కమిషనర్ రమణమూర్తి



సమీక్షలో మాట్లాడుతున్న అధికారులు

డాబాగార్డెన్స్: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ జరిగే ప్రక్రియలోనే ఆస్తి పన్ను పేరు మార్చే విధానాన్ని ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం కల్పించిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి వెల్లడించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనే ఇక నుంచి ఆస్తి పన్ను పేరు మార్పు చేసేలా విధి విధానాలపై రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ జి.బాలకృష్ణ, జీవీఎంసీ డీసీఆర్ శ్రీనివాసరావుతో కలిసి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో భూములు, భవనాలు, అపార్ట్‌మెంట్ల కొనుగోలు ప్రక్రియలో భాగంగా ఇక నుంచి సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోని జీవీఎంసీ అసెస్‌మెంట్ కలిగిన ఆస్తులకు ఆస్తి పన్ను పేరు మార్పు ఆటోమేటిక్‌గా జరిపే అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. ఇక మీదట సంబంధిత ఆస్తుల రిజిస్ట్రేషన్ అనంతరం జీవీఎంసీ కార్యాలయానికి రాకుండానే ఇంటి పన్ను పేరు మార్పు జరిగి పోతుందన్నారు. ఈ ప్రక్రియ ఆగస్టు 1 నుంచి జీవీఎంసీ పరిధిలో అమలు కానుందన్నారు. ఇందుకు ఆస్తుల కొనుగోలు సమయంలోనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆస్తి పన్ను పేరు మార్పునకు సంబంధించి జీవీఎంసీకి చెల్లించాల్సిన మ్యూటేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే జీవీఎంసీ రికార్డుల్లో ఆటోమేటిక్‌గా ఆస్తి యజమాని పేరు, ఆస్తిపన్ను పేరు మారిపోతుందన్నారు. దీనిపై జీవీఎంసీ రెవెన్యూ విభాగం, రిజిస్ట్రేషన్ కార్యాలయాల అధికారులు, ఉద్యోగులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

కాకి వర్సెస్ పల్లా..!

- అభివృద్ధి కార్యక్రమాలు జరగనీయకుండా అడ్డుకట్ట
- 69వ వార్డులో నిలిచిన అభివృద్ధి పనులు
- పనులు మొదలుపెట్టాలంటూ స్థానికుల నుంచి వినతులు
- గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు ఒకే రోజు 30 మంది ఫిర్యాదుల అందజేత
- తాను హాజరుకాకుండా పనులు మొదలుపెట్టకూడదని పల్లా ఆదేశం?



జీవీఎంసీ కమిషనర్‌కు తుంగలాం రెడ్డి వేమన సంక్షేమ సేవా సంఘం తరపున ఇచ్చిన ఫిర్యాదు

విశాఖ సిటీ : సొంత పార్టీ కార్పొరేటర్ వార్డులో ఒక్క అభివృద్ధి పని కూడా జరగనీయకుండా ఏకంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ అడ్డుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏకంగా రూ.7 కోట్ల విలువ చేసే వివిధ పనులకు శంకుస్థాపన జరగనీయకుండా పల్లా అడ్డుకుంటున్నారనే విమర్శలున్నాయి. 69వ వార్డులో ఇప్పటికే వర్క్ ఆర్డర్లు ఇచ్చిన పనులు కూడా ప్రారంభం కాని దుస్థితి నెలకొంది. సోమవారం వార్డుకు చెందిన 30 మంది తమ వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదంటూ జీవీఎంసీలో జరిగిన పీజీఆర్ఎస్‌లో నేరుగా కమిషనర్ కేతన్ గార్గ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తమ వార్డులో రోడ్డు వేయడం లేదని ఒకరు.. డ్రైనేజీ నిర్మించడం లేదని మరొకరు ఇలా పలు సమస్యలపై తుంగలాం రెడ్డి వేమన సంక్షేమ సేవా సంఘం, ఉప్పాడ రామచంద్రరావు, గ్రామాభివృద్ధి యువజన సేవా సంఘం, కొల్లి కంచురావు ఇలా ఏకంగా 30 మంది వ్యక్తులు, సంఘాలు వచ్చి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమవుతోంది.

శంకుస్థాపనలకు నసేమిరా...!

వాస్తవానికి 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డికి పల్లాకు మధ్య మొదటి నుంచి వివాదాలు నడుస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో కాకి గోవిందరెడ్డి సహకరించలేదంటూ పల్లా ఇప్పటికే పార్టీకి ఫిర్యాదులు కూడా చేశారు. మొన్న జరిగిన మేయర్ ఎన్నికల్లో మాత్రం పార్టీ తరపునే ఉండాలంటూ కాకి గోవింద రెడ్డిని పల్లా స్వయంగా బతిమాలాడారు. అంతేకాకుండా కలిసి పనిచేద్దామని కూడా చెప్పినట్టు తెలుస్తోంది. తీరా మేయర్ ఎన్నిక ముగిసిన తర్వాత కాకి గోవిందరెడ్డి వార్డులో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా స్థానిక ఎమ్మెల్యేగా తనకు తెలియజేయాలంటూ జీవీఎంసీ అధికారులకు పల్లా హుకుం జారీచేసినట్టు ప్రచారం జరుగుతోంది. తాను హాజరుకాకుండా ఎటువంటి పనులు ప్రారంభించకూడదని గట్టిగానే చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో 69వ వార్డులో ఇప్పటివరకు పలు పనుల కోసం టెండర్లను పిలిచి.. వర్క్ ఆర్డర్లు కూడా కాంట్రాక్టర్లకు ఇచ్చినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. ఎందుకంటే ఈ పనుల శంకుస్థాపనలకు హాజరయ్యేందుకు ఏ తేదీ కూడా పల్లా ఇవ్వడం లేదు. దీంతో పనులన్నీ ప్రారంభం కాకుండానే నిలిచిపోయాయి. అధికారపార్టీ నేతలు ఇద్దరు గొడవపడుతూ.. తమను ఎందుకు ఇబ్బందులు పెడతారంటూ స్థానిక వార్డుకు చెందిన ప్రజలు వాపోతున్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 174 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 174 వినతులు స్వీకరించారు. మేయర్ పీలా తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఫిర్యాదుల్లో పట్టణ ప్రణాళికా విభాగానికి అత్యధికంగా 84 ఫిర్యాదులు అందాయి. జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 4, రెవెన్యూకు 17, ప్రజారోగ్యానికి 12, ఇంజనీరింగ్ విభాగానికి 47, హార్టికల్చర్‌కు 1,యూసీడీ విభాగానికి 9 అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు పరిష్కరించాల్సిన ఫిర్యాదులు 30 రోజుల నుంచి వారి లాగిన్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఏ విభాగానికి సంబంధించిన ఫిర్యాదును ఆయా విభాగాధిపతులు తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం

- రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్
- పీజీఆర్ఎస్‌కు 427 వినతులు



వినతులు స్వీకరిస్తున్న మంత్రి సత్యప్రసాద్

మహారాణిపేట: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. విశాఖ, తిరుపతి జిల్లాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక చాలా బాగా జరుగుతోందని, సమస్యల పరిష్కారంలో కూడా సానుకూలత ఉందని పేర్కొన్నారు. ఇక్కడ అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేసి మిగిలిన చోట్ల అమలు చేసేందుకు స్వయంగా పీజీఆర్ఎస్‌లో పాల్గొంటున్నానని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో స్వయంగా మంత్రి సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ నిర్వహణ, సమస్యల పరిష్కారంలో ప్రజల నుంచి సానుకూల అభిప్రాయం (పాజిటివ్ పర్సెప్షన్) నమోదవుతోందని గుర్తుచేశారు. యోగాంధ్ర నిర్వహణలో అధికార యంత్రాంగం అభినందనీయ పాత్ర పోషించి, గిన్నిస్ రికార్డుతో పాటు మరో 22 రికార్డులు సాధించిందని ఆయన కొనియాడారు. అనంతరం జిల్లాలో పీజీఆర్ఎస్ నిర్వహణ, అధికారుల పనితీరు, ఇతర అంశాలను కలెక్టర్ హరేందిర ప్రసాద్ వివరించారు. వారం వారం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత సమయంలో ఎండార్స్‌మెంట్ ఇస్తూ పరిష్కరిస్తున్నామని, క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహిస్తూ నాణ్యమైన పరిష్కారం చూపుతున్నామని ఆయన తెలిపారు.

427 వినతుల స్వీకరణ

వివిధ సమస్యలపై మొత్తం 427 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి చెందినవి 180, జీవీఎంసీకి 54, పోలీసు శాఖకు 23, ఇతర విభాగాలకు చెందినవి 170 ఫిర్యాదులు ఉన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి ప్రభుత్వ, ప్రైవేటు భూ ఆక్రమణలు, వ్యక్తిగత కార్యకలాపాలకు అడ్డంకిగా నిలుస్తున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫిర్యాదులు సమర్పించారు.

పంచగ్రామాల భూసమస్యకు త్వరలో పరిష్కారం

మహారాణిపేట : పంచగ్రామాల భూ సమస్యను సాధ్యమైనంత త్వరలో పరిష్కరించడానికి సీఎం కృషి చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో అవకాశాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగా విశాఖపట్నం ఐటీ హబ్‌గా తయారు కాబోతోందని, అనేక సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. ప్రైవేటు భూములు 22ఏలో పెట్టకూడదని సీఎం చంద్రబాబు ఇప్పటికే చెప్పారని గుర్తు చేశారు. త్వరలో విశాఖలో మెట్రో పనులు ప్రారంభం కానున్నట్లు మంత్రి వెల్లడించారు. సీఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం సముద్ర తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ధరలు దడ



కూర'గాయాలు'

- ఘాటెక్కిన పచ్చిమిర్చి, కిలో రూ.120
- రైతు బజార్లకు కుళ్లిన టమాటా సరఫరా
- బయట మార్కెట్‌లో కేజీ రూ.60
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- ధరల అదుపుపై దృష్టి పెట్టని కూటమి ప్రభుత్వం

విశాఖ విద్య: కూరగాయల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. పది రోజుల క్రితం రూ. 60 ఉన్న పచ్చిమిర్చి ప్రస్తుతం రూ. 120కి చేరింది. వంకాయలు, దొండకాయలు, బీరకాయలు వంటి అన్ని రకాల కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి, కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, దీంతో ధరలకు అదుపు లేకుండా పోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'కూటమి ప్రభుత్వ పాలనలో ఏం కొనేటట్టు లేదు, ఏం తినేటట్టు లేదని' ప్రజానీకం బెంబేలెత్తుతోంది. ధరలను నియంత్రించడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఈ ధరల పెరుగుదల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి నాయకులే మధ్య దళారులుగా వ్యవహరిస్తున్నారని, అందుకే మార్కెట్‌లో జరుగుతున్న ఈ మాయాజాలాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

రైతు బజార్లకు నాణ్యత లేని సరుకులు

నగర ప్రజలకు కూరగాయలు ఇతర నిత్యావసర సరుకులను నిర్ణీత ధరలకు అందించే లక్ష్యంతో జిల్లాలో 13 రైతు బజార్లను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఇక్కడికి నాణ్యత లేని సరుకులు సరఫరా అవుతున్నాయి. దీంతో వినియోగదారులు వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. రైతు బజార్లలో విక్రయించే ఉల్లిపాయలు కుళ్లిపోయి, దుర్వాసన వస్తున్నాయని, ఇంటికి తెచ్చుకున్న రెండు రోజులకే పాడైపోతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. దీంతో అధిక ధరలు చెల్లించి బయటి మార్కెట్లలోనే అన్ని రకాల కూరగాయలు కొనాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు.



సీతమ్మధార రైతుబజార్‌లో టమాటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

టమాటా సరఫరాలో ప్రభుత్వ వైఫల్యం

చిత్తూరు జిల్లాలోని మదనపల్లె మార్కెట్ నుంచి నగరానికి టమాటా సరఫరా అవుతుంది. ప్రతిరోజూ సుమారు 200 టన్నుల టమాటా వస్తుంది. ఇందులో పాడైన టమాటాను రైతు బజార్ల దుకాణదారులకు అంటగట్టి, మంచివి బయటి మార్కెట్‌లో అధిక ధరకు విక్రయించేందుకు వ్యాపారులు పథకం వేస్తున్నారు. కుళ్లిన టమాటా సరఫరా అవుతుండటంతో తమకు నష్టం వస్తోందని రైతు బజార్ల దుకాణదారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రభుత్వం టమాటోను కొనుగోలు చేసి రైతు బజార్లకు సరఫరా చేసేది. కానీ ప్రస్తుతం వ్యాపారులే పెత్తనం చెలాయిస్తుండటంతో ప్రజలకు ధరల భారం తప్పడం లేదు.

పర్యవేక్షణాధికారుల కొరత

రైతు బజార్లపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. గతంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన యాసిన్‌ను బదిలీ చేసినా, ఆ స్థానంలో ఇంకా ఎవరూ విధుల్లో చేరలేదు. డిప్యూటీ డైరెక్టర్ ప్రస్తుతం అసిస్టెంట్ డైరెక్టర్ అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. రైతు బజార్లలో ఏం జరుగుతుందో పర్యవేక్షించే వారు లేకపోవడంతో వినియోగదారులకు అవి ఉపయోగపడటం లేదు. ఫలితంగా, బయటి మార్కెట్‌లో ధరల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది.

కూరగాయల ధరలు

(సోమవారం ధరలు కిలో.రూ.)

	రైతు బజార్	బయట దుకాణాల్లో
పచ్చి మిర్చి	రూ.72	రూ.120
టమాటా	రూ.45	రూ.60
ఉల్లిపాయలు	రూ.21	రూ.40
దొండకాయలు	రూ.28	రూ.80
బీరకాయలు	రూ.32	రూ.70
వంకాయలు	రూ.38	రూ.80

రైతు బజార్లుండి ఏం ప్రయోజనం



ఒక్క పూట ఇంట్లో అందరికీ కూరవండుకోవాలంటే రూ.100లు పెట్టి కూరగాయలు కొనాల్సి వస్తోంది. మొన్న ఉన్న రేటు, ఈ రోజు ఉండటం లేదు. పచ్చిమిర్చి, టమాటా అయితే మరీ దారుణం. పావుకిలో పచ్చిమిర్చి రూ.30లు పెట్టి కొనాల్సి వచ్చింది. ఇలా అయితే మాలాంటోళ్లం ఎలా బతకాలి. రైతుబజార్లు ఉండి, ఏం ప్రయోజనం. ప్రభుత్వం పట్టించుకోవాలి. – ఫాతిమా, లక్ష్మీనగర్

వ్యాపారులు నిర్ణయించిందే ధర



హోల్‌సేల్ మార్కెట్లోనే ధరలు అధికంగా ఉంటున్నాయి. పెద్ద వ్యాపారస్తులు పెట్టిన రేటుకు కూరగాయలు కొనితెచ్చుకుంటున్నాం. పచ్చిమిర్చి దొరకటం లేదు. క్రేట్లలో వస్తున్న టమాటా కుళ్లిపోతోంది. దీని వల్ల మాకే నష్టం వస్తోంది. అందుకే రేటు పెంచి విక్రయిస్తేనే కానీ, మాకు గిట్టుబాటు కావటం లేదు. హోల్ సేల్ మార్కెట్లో ధరలకు నియంత్రం ఉండేలా అధికారులు చూడాలి.

–ఆర్.మల్లికార్జున రావు, దుకాణదారుడు

మరింత పటిష్టంగా.. సీబీఎస్ఈ విద్య

- ఎన్ఈపీ-2020 నిబంధనలకు అనుగుణంగా బోధన
- సీబీఎస్ఈ పాఠశాలల్లో ప్రత్యేక భద్రతా చర్యలు
- 2026 నుంచి ఏటా రెండు సార్లు బోర్డు పబ్లిక్ పరీక్షలు
- జిల్లాలో 40 సీబీఎస్ఈ స్కూళ్లు, 39,517 మంది విద్యార్థులు
- నూతన మార్గదర్శకాలు జారీ చేసిన సీబీఎస్ఈ బోర్డు


విశాఖ వ్యాలీ సీబీఎస్ఈ స్కూల్

ఆరిలోవ: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) విద్యను మరింత పటిష్టవంతం చేస్తున్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)-2020 మేరకు సీబీఎస్ఈ పాఠశాలల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించి నియమ నిబంధనలపై జిల్లాలోని సీబీఎస్ఈ స్కూళ్ల యాజమాన్యాలకు బోర్డు సమాచారం అందించింది. ఈ నిబంధనల మేరకు విద్యార్థుల భద్రత కోసం ప్రతి పాఠశాలలో సీసీ కెమెరాలు తప్పనిసరి చేశారు. పాఠశాల ప్రధాన ద్వారం, క్రీడా మైదానం, కారిడార్లు, తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వాటిలో ఆడియో, వీడియో స్పష్టత ఉండాలి. ప్రతి తరగతి గదిలో 40 మంది విద్యార్థులు మాత్రమే ఉండాలి. మంచి గాలి, వెలుతురు వచ్చేలా తరగతి గదుల్లో సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

ఏటా రెండుసార్లు పరీక్షలు

నూతన విధానం ప్రకారం సీబీఎస్ఈ బోర్డు ద్వారా 2026 నుంచి పదో తరగతి పరీక్షలు రెండుసార్లు నిర్వహించనున్నారు. ఇంతవరకు ఒకసారి మాత్రమే పబ్లిక్ పరీక్షలు జరిగేవి. ఇప్పుడు విద్యార్థులు మార్కులు మెరుగు పరచుకునేందు(బెటర్‌మెంట్)కు అవకాశం కల్పిస్తూ రెండుసార్లు పరీక్షలు నిర్వహించే విధానాన్ని తీసుకొచ్చారు. రెండోసారి పరీక్ష రాయాలనుకునే విద్యార్థి మొదటి సారి పరీక్ష తప్పనిసరిగా రాసి ఉండాలి. ఈ విధానం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. దీంతో పాటు పరీక్ష పేపర్‌లో కూడా మార్పులు తీసుకొచ్చారు. ప్రశ్నాపత్రంలో స్వల్ప, దీర్ఘ సమాధాన ప్రశ్నలను బోర్డు తగ్గించింది. ఆలోచన, నైపుణ్యం కలిగించే విశ్లేషణాత్మక, వివరణాత్మక ప్రశ్నలకు ప్రాధాన్యత ఇవ్వనుంది. దీనివల్ల భావాలను అర్థంచేసుకునేలా విద్యార్థి తీర్చిదిద్దబడతాడని బోర్డు నమ్మకం.

జిల్లాలో 40 సీబీఎస్ఈ స్కూళ్లు

విశాఖ జిల్లాలో 40 సీబీఎస్ఈ పాఠశాలలున్నాయి. వాటిలో టింపనీ, విశాఖ వ్యాలీ, జవహర్ నవోదయ, ఓక్రిడ్జ్, ఎస్ఎఫ్ఎస్, సెయింట్ ఆన్స్, డిపాల్, శ్రీచైతన్య, నారాయణ, కేకేఆర్ గౌతం తదితర పాఠశాలలు ఉన్నాయి. వాటిలో రెండు ప్రైమరీ, ఒక అప్పర్ ప్రైమరీ పాఠశాలతో పాటు 37 ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో 39,517 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో ఆయా పాఠశాలలన్నీ తప్పనిసరిగా సీబీఎస్ఈ నూతన విధానాల మేరకు భద్రతా చర్యలు పాటించాలని బోర్డు స్పష్టం చేసింది.

ఆరోగ్య శ్రీపై నీలినీడలు

- ఆస్పత్రులకు బిల్లులు చెల్లించని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 106 ఆస్పత్రులకు రూ.260 కోట్ల మేర బకాయిలు
- పేదలకు అందని 'ఆరోగ్యశ్రీ' వైద్యం



మహారాణిపేట: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమలుపై కూటమి ప్రభుత్వం 'సవతి తల్లి ప్రేమ' చూపుతోంది. ప్రైవేటు ఆసుపత్రులకు కోట్ల రూపాయల బకాయిలను పెండింగ్‌లో పెట్టడంతో, పేద రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని ఆందోళన వ్యక్తం అవుతోంది. దీంతో ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ కార్డులకు వైద్యసేవలు అందించడంలో కార్పొరేట్ ఆస్పత్రులు ఆసక్తి చూపడం లేదు.

పేదలపై కూటమి సర్కార్ కత్తి

ఎన్నికలకు ముందు సంక్షేమ పథకాలపై హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఉన్న పథకాలను ఎత్తేసే ప్రయత్నం చేస్తోంది. మద్యం విక్రయాలు, విద్యుత్ చార్జీల పెంపు ద్వారా ఖజానా నింపుకుంటున్న ప్రభుత్వం, దివంగత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకం నిర్వీర్యం చేసేందుకు దృష్టి సారించిందని ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లాలో పరిస్థితి

జిల్లాలో 106 ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో ఉన్నాయి. ఈ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సుమారు రూ. 260 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే పేదల ఆరోగ్యశ్రీ వైద్య సేవల్లో అంతరాయం కలుగుతోందని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో అద్భుతమైన సేవలు అందించిన కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు ఇప్పుడు కార్డుదారులకు సేవలు అందించడానికి వెనుకాడడంతో, లబ్ధిదారుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.

కార్డుదారులందరికీ వైద్యం

ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్న అందరికీ వైద్య సేవలు అందుతున్నాయని, ఎక్కడైనా సేవలు అందకపోతే తమను సంప్రదించాలని ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ అప్పారావు కోరారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం ప్రతి నెలా నిధులు విడుదల చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

కార్మిక హక్కుల రక్షణకు పోరాటాలు

దాబాగార్డెన్స్: కార్మిక హక్కుల రక్షణకై సీఐటీయూ ఉధృత పోరాటాలకు సిద్ధంగా ఉందని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. సిటు జిల్లా 13వ మహాసభల ముగింపు సందర్భంగా సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, అంగన్‌వాడీలు, మున్సిపల్, ఆశా, మిడ్-డే మీల్స్, వీవోఏ, ఆర్పీల సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేశామని కుమార్ గుర్తు చేశారు. కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న సమ్మె చేశామన్నారు. స్మార్ట్ మీటర్ల రద్దు, విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 5న స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని కోరుతూ ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద మహాధర్నా చేపట్టనున్నామని చెప్పారు. డిసెంబర్ 4న విశాఖలో సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు జరగనున్నాయన్నారు. అనంతరం 26 మందితో సీఐటీయూ నూతన కార్యవర్గం, 104 మందితో కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిటు కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, ఉపాధ్యక్షుడు కేఎం.కుమార మంగళం, కార్యదర్శులు పి.మణి, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అండర్-16 క్రికెట్ టోర్నీలో
విశాఖ అదరహో

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-16 అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో విశాఖ జట్టు అద్భుతమైన ప్రదర్శనతో ఆధిపత్యాన్ని చాటుకుంది. ముఖ్యంగా నార్త్ జోన్‌లో విశాఖ జట్టు వరుస విజయాలతో దూసుకుపోయింది. ఈ టోర్నమెంట్‌ను మూడు జోన్‌లుగా విభజించి నిర్వహించారు. నార్త్ జోన్‌లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జట్లు పోటీపడగా, సెంట్రల్ జోన్‌లో నాలుగు ఉమ్మడి జిల్లాల జట్లు, సౌత్ జోన్‌లో ఐదు ఉమ్మడి జిల్లాల జట్లు తలపడ్డాయి. విశాఖ జట్టు తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ విజయం సాధించి, మొత్తం పదహారు పాయింట్లతో తమ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. సెంట్రల్ జోన్‌లో ప్రకాశం జట్టు 13 పాయింట్లతో ఆధిక్యంలో ఉండగా, సౌత్ జోన్‌లో చిత్తూరు జట్టు 14 పాయింట్లతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. తూర్పు గోదావరి జట్టుపై 206 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. విజయనగరంపై ఇన్నింగ్స్ తేడాతో తిరుగులేని గెలుపును నమోదు చేసింది. శ్రీకాకుళం జట్టుపై కూడా ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి తమ బలాన్ని నిరూపించుకుంది. ఈ మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లతో కూడిన నాలుగు జట్లను ప్రాబబుల్స్‌గా ఎంపిక చేయనున్నారు. అనంతరం, ఆంధ్రప్రదేశ్ అండర్-16 జట్టును ఎంపిక చేయనున్నారు.

సత్తాచాటిన కుర్రాళ్లు : అండర్-16 అంతర్ జిల్లాల టోర్నీలో విశాఖ జట్టు యువ ఆటగాళ్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా దేవాశిష్, శ్రీహర్ష ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో దేవాశిష్, హృతిక్, విక్రాంత్, శ్రీహర్ష, పరంవీర్, సాయిచరణ్ బ్యాటింగ్‌లో రాణించారు. వీరంతా 200కి పైగా పరుగులు సాధించి విశాఖ జట్టును టాప్-6లో నిలిపారు. బౌలింగ్‌లో యశ్వంత్ (23 వికెట్లు), భానుస్వరూప్ (22 వికెట్లు), చరిత్ (15 వికెట్లు) అద్భుత ప్రదర్శన కనబరిచారు. భానుస్వరూప్, దేవాశిష్ చెరో 13 వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. వికెట్ల వెనుక లోహిత్ 13 మందిని పెవిలియన్‌కు పంపగా, మణికంఠ (5 క్యాచ్‌లు), కార్తికేయ (5 క్యాచ్‌లు), శ్రీహర్ష (3 క్యాచ్‌లు) చక్కటి ఫీల్డింగ్‌తో తమ ప్రతిభను చాటుకున్నారు. హృతిక్-సాయిచరణ్ జోడి 204 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు పటిష్టమైన పునాది వేసింది.

16 ఏళ్ల కుర్రోడు.. సత్తాచాటాడు

- వాలీబాల్‌లో జాతీయస్థాయి ప్రతిభ
- భారత్‌జట్టుకు చరణ్ ఎంపికపై హర్షాతిరేకాలు


అవార్డులతో చరణ్


బాల్‌ను కిందపడకున్న అడ్డుకున్న చరణ్

కూర్మన్నపాలెం : ఆటల పట్ల ఎలాంటి అవగాహన లేని 16 ఏళ్ల అడ్డాడ చరణ్, అనతి కాలంలోనే అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడిగా ఎదిగి అందరినీ ఆశ్చర్యపరిచాడు. వడ్లపూడిలోని కణితి కాలనీకి చెందిన చరణ్.. థాయిలాండ్‌లో జరిగిన అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో భారతదేశానికి మూడో స్థానం సాధించి పెట్టాడు. కేవలం ఏడున్నర నెలల శిక్షణతో 16 దేశాలతో పోటీపడి ఈ ఘనత సాధించడం విశేషం.

కణితి కాలనీలోని తన మేనమామల వద్ద పెరుగుతూ ఉక్కునగరం డీఏవీపీ స్కూల్‌లో చదువుతున్న చరణ్, ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు థాయిలాండ్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. ఆసియా వాలీబాల్ కాన్ఫెడరేషన్ ఈ క్రీడలకు సారథ్యం వహించింది. ఈ పోటీల్లో చరణ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు. అంతేకాకుండా ఈ పోటీలకు దక్షిణ భారతదేశం నుంచి ఆయనొక్కడే ఎంపిక కావడం విశేషం. అలాగే వచ్చే ఏడాది ఖతర్‌లో నిర్వహించే ప్రపంచ చాంపియన్ పోటీలకు కూడా చరణ్‌ను భారత జట్టుకు ఎంపిక చేశారు.

కరోనా సమయంలో వాలీబాల్‌వైపు..

క్రీడల పట్ల ఏమాత్రం అవగాహన లేని చరణ్‌కు కరోనా మహమ్మారి విజృంభించిన సమయం కలిసొచ్చింది. ఆ సమయంలో పాఠశాలలన్నీ మూతబడటంతో, ఎటూ తోచక చాలా సమయం ఇంట్లోనే గడిపేవాడు. అయితే ఒకసారి ఇంట్లో విసుగు అనిపించి సమీపంలోని మైదానం వైపు వెళ్లాడు. అప్పటికే అక్కడ తన వయసు ఉన్న పిల్లలు వాలీబాల్ ఆడటం గమనించాడు. అలా వాలీబాల్‌పై మక్కువ పెరిగింది. ఆ తరువాత పాఠశాలలు తెరచుకున్న తరువాత చరణ్ ఆడుతున్న తీరును ఉపాధ్యాయులు గమనించి ప్రోత్సహించారు. డీఏవీపీ పాఠశాలల కేంద్ర కార్యాలయం ఢిల్లీ, జార్ఖండ్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పోటీలకు చరణ్‌ను ఎంపిక చేశారు. ఆ పోటీల్లో చరణ్‌సత్తా చాటాడు. చరణ్ మేనమావ.. అక్కయ్య పాలెం స్టేడియంలో స్పోర్ట్స్ కోచ్‌ను సంప్రదించి ఆయన వద్దకు తీసుకెళ్లారు. కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఆయన వద్ద చరణ్ అన్ని మెలకువలు తెలుసుకొని వాలీబాల్ ఆటలో ఆరితేరిపోయాడు. ఈ లోగా థాయిలాండ్‌లో జరిగే పోటీలకు ఎంపిక జరగడంతో ముందుగా చరణ్‌ను ఎంపిక చేసి భారత జట్టుతో పంపించారు. ఆయనకు జాతీయ స్థాయి పోటీలు కొత్త అయినప్పటికీ, ఏమాత్రం జంకకుండా తనదైన శైలిలో ప్రతిభ కనబరిచి భారత్‌కు తృతీయ బహుమతి సాధించి పెట్టాడు. అక్కడ వచ్చే ఏడాది ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపిక జరగగా చరణ్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

మేనమామ ప్రోత్సాహంతో..

చరణ్ శ్రీకాకుళం జిల్లా పలాసకు సమీపంలోని అంతరగుడ్డి గ్రామం అయినప్పటికీ, 87వ వార్డులోని కణితి కాలనీలోని తన మేనమామ దానప్పలు వద్ద పెరుగుతూ ఉక్కునగరంలో చదువుతున్నాడు. మేనమామ ప్రోత్సాహంతో వాలీబాల్‌లో రాణిస్తున్నాడు. ఇటీవలే పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాడు. ఒకవైపు చదువుతూనే మరోవైపు క్రీడల పట్ల ఆసక్తి చూపుతూ అందులో కూడా మంచి ప్రతిభ చూపుతుండటం పట్ల పలువురు అభినందిస్తున్నారు. చరణ్ తల్లిదండ్రులు కమలనాథం, దేవీలు తమ సొంత ఊరిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

జంపింగ్ స్కిల్స్ సూపర్



మొదట్లో చరణ్‌కు శిక్షణ ఇవ్వడానికి కొంతమేర అంగీకారం తెలపలేదు. అయితే తల్లి దండ్రులు, మేనమామ ప్రోత్సాహాన్ని చూసి అంగీకరించాం. చరణ్‌లో జంపింగ్ స్కిల్స్ బాగా ఉన్నాయి. అవి గుర్తించిన తరువాత శిక్షణ మరింత పకడ్బందీగా ఇచ్చా. తాము అనుకున్నట్టుగానే బాగా రాణించాడు. జాతీయ స్థాయిలో రాణించాడు.

– ఎం.సత్యనారాయణ, వాలీబాల్ కోచ్

సమస్యలు పరిష్కరించకుంటే ఆత్మహత్యలే శరణ్యం

మంత్రి ఎదుట రోగి మిత్రల ఆవేదన


వినతి పత్రం అందజేసిన అనంతరం కలెక్టరేట్ బయట రోగిమిత్రలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగి మిత్రలుగా విధులు నిర్వర్తించిన కొందరు, ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్‌సోర్సింగ్ (ఆప్కోస్) సర్వీసెస్‌లో చేర్చుతామని తమ వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిస్తూ సోమవారం పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌కు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు రోగిమిత్రలు వినతిపత్రాలు అందజేశారు. 2012 నుంచి కేజీహెచ్‌లో రోగి మిత్రలుగా పనిచేస్తున్నామని, నెలకు రూ.3,800 నుంచి రూ. 6,000 మధ్య వస్తున్న జీతం సరిపోవడం లేదని పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు వారు తెలిపారు. అయితే ఆరోగ్యశ్రీలో నిధులు లేవని చెప్పి తమను విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. ఇదే సమయంలో కేజీహెచ్‌కు అధికారి సత్యనారాయణ.. ఆప్కోస్‌లో కలిపి జీతాలు పెంచుతామని చెప్పి తమ నుంచి రూ. 20 వేల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారని రోగి మిత్రలు వాపోయారు. ఎంప్లాయిమెంట్ అధికారి సాంబిరెడ్డి, కేజీహెచ్ అధికారి సత్యనారాయణ డబ్బులు తీసుకుని నెలలు గడుస్తున్నా తమకు న్యాయం జరగలేదని వారు ఆవేదన చెందారు. ఈ విషయంపై గత నెల 20న పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించగా, కలెక్టర్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. అయితే విచారణ చేస్తున్న అధికారులతో సదరు అధికారికి మంచి సంబంధాలు ఉన్నాయని..విచారణపై తమకు నమ్మకం లేదని రోగి మిత్రలు స్పష్టం చేశారు. ఈ విచారణ వల్ల న్యాయం జరగదని, నిజాయతీ అధికారులను విచారణకు నియమిస్తేనే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందని వారు కోరారు. కోవిడ్, హుద్‌హుద్ వంటి విపత్కర సమయాల్లో రోగి మిత్రలుగా ఎన్నో సేవలు అందించామని, నేడు ఉద్యోగాలు పోయి, డబ్బులు కట్టి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రోగి మిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రౌడీ షీటర్‌పై దాడి చేసిన నిందితులకు రిమాండ్

మరో ఆరుగురి కోసం గాలింపు


కేసు వివరాలను వెల్లడిస్తున్న సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు

ఉక్కునగరం: మూడు రోజుల క్రితం స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీపంలోని లారీ యార్డ్ వద్ద రౌడీ షీటర్‌పై జరిగిన దాడి కేసులో ఆరుగురు నిందితులను స్టీల్‌ప్లాంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్ ఏసీపీ వై. శ్రీనివాసరావు ఈ కేసు వివరాలను వెల్లడించారు. దేశపాత్రుని పాలెం సమీపంలోని స్నేహపురి కాలనీకి చెందిన రౌడీ షీటర్ మొల్లి సంతోష్‌కుమార్ (37) ఈ నెల 25న తన కుమార్తెను స్కూల్ నుంచి తీసుకురావడానికి వెళ్లాడు. అక్కడ ఆలస్యం అవుతుండటంతో, స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీపంలోని లారీ యార్డ్ వద్ద తన సోదరుడు సతీష్, స్నేహితుడు గణేష్‌తో కలిసి మాట్లాడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పెదగంట్యాడకు చెందిన మొల్లి శివకృష్ణ, మొల్లి శ్రీను, బాక్సర్లు వాసు మీసాల రవి, వియ్యపు ప్రవీణ్ మరికొంతమందితో అక్కడికి చేరుకుని సంతోష్‌కుమార్‌పై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. సంతోష్‌కుమార్ అక్కడి నుంచి తప్పించుకుని సమీపంలోని పొదల్లో దాక్కున్నాడు. ఈ దాడిలో మొల్లి శివకృష్ణ, మొల్లి శ్రీను కీలక పాత్ర పోషించారు. వీరిద్దరూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అనుచరులని తెలుస్తోంది. దాడి అనంతరం సంతోష్‌కుమార్ ఎస్వీఎస్ పాలీ క్లినిక్‌లో ప్రాథమిక చికిత్స చేయించుకుని, ఆ తర్వాత అగనంపూడి ఆస్పత్రికి వెళ్లాడు. మరుసటి రోజు అతను స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఈ ఘటనలో పాల్గొన్న మొల్లి శివకృష్ణ, రవి, ప్రవీణ్, జి. మనోజ్ కుమార్, ముచ్చి తరుణ్ అలియాస్ తేజ, సిరసపల్లి జితేంద్ర కుమార్‌లను అరెస్ట్ చేయగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందన్నారు. దాడిలో పాలుపంచుకున్న మరో ఆరుగురిని గుర్తించామని, వారి కోసం గాలిస్తున్నామని ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో స్టేషన్ సీఐ ఈ. కేశవరావు కూడా పాల్గొన్నారు.

వేధింపుల భర్తకు నాలుగేళ్ల జైలు

విశాఖ లీగల్ : వరకట్నం కోసం భార్యను హింసించి తీవ్రంగా గాయపరిచిన కేసులో భర్తకు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని మహిళా కోర్టు న్యాయమూర్తి వి. శ్రీనివాసరావు సోమవారం తీర్పునిచ్చారు. రెండు వేర్వేరు నేరాలకు గాను నిందితుడు రూ. 20 వేల జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా నాలుగు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖజానారావు అందించిన వివరాల ప్రకారం నిందితుడు మంగళగిరి పరదేశి (22) దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని దువ్వాడ ఉప్పర్ల కాలనీలో నివసించేవాడు. పరదేశికి అదే ప్రాంతానికి చెందిన బాధితురాలితో 2014 ఏప్రిల్ 14న వివాహం జరిగింది. వివాహ సమయంలో బాధితురాలి తల్లిదండ్రులు పరదేశికి ఘనంగా కట్నకానుకలు సమర్పించారు. అయినప్పటికీ అదనపు కట్నం కోసం నిందితుడు, అతని సోదరి తరచూ బాధితురాలిని వేధించేవాడు. 2016 నవంబర్ 4న అదనపు కట్నం తేలేదన్న నెపంతో నిందితుడు తన భార్యను సెంటరింగ్ రాడ్‌తో బలంగా కొట్టాడు. దీంతో బాధితురాలు తీవ్ర గాయాల పాలైంది. భర్త ఆగడాలను భరించలేక ఆమె దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు నిందితులపై సెక్షన్లు 498ఏ, 325, 307 కింద కేసు నమోదు చేసి నేరాభియోగపత్రాన్ని దాఖలు చేశారు. న్యాయస్థానం వరకట్న వేధింపులకు గాను రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించింది. తీవ్రంగా గాయపరిచినందుకు సెక్షన్ 325 కింద నాలుగేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించింది. మొత్తం జరిమానాలో రూ. 16,000 బాధితురాలికి చెల్లించాలని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్‌కు సి.హెచ్. నవీన్ కుమార్, కే. రాజేష్‌లు సహకరించారు.

బుసకొట్టి డిమాండ్ చేస్తున్నాం.. సమస్యలు పరిష్కరించమని...!



పాముకు నీరు పడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న స్నేక్ క్యాచర్ కిరణ్

జీవీఎంసీ ఆఫీస్ ప్రాంగణం సాధారణంగా ఉండే బూజు వాసనలకు బదులుగా, మా స్నేహితుల బుసబుసలు, మొరుగుళ్లతో దద్దరిల్లింది. అధికారిక సమావేశాల బోరింగ్ మాటలకు బదులు, మా వాళ్లే స్టేజ్‌పైకి వచ్చారు. మొదటగా మా అన్న స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్, మా పాములందరికీ నీళ్లిస్తూ నిరసన తెలిపాడు. ఆ వేడిలో కాస్త చల్లగా అనిపించినా, అన్న కష్టం మాకు అర్థమైంది. మమ్మల్ని పట్టుకుని, సురక్షితంగా మరో చోట వదిలేసే అన్నకు సరైన గుర్తింపు లేదని మాకు తెలుసు. ఆ తర్వాత వీధిలో మా జాగిలా బంధువులను పట్టి నగరాన్ని కాపాడుతున్నామని చెప్పే వెటర్నరీ కార్మికులు, వాళ్ళతో పాటు మా జాగిల స్నేహితులను కూడా తెచ్చారు. మేం చూస్తూ ఉండగానే, జీవీఎంసీ కార్యాలయం అక్షరాలా మా జంతువుల అడ్డాగా మారిపోయింది. ఎందుకీ వింత ప్రదర్శన?

ఇదంతా మా వెటర్నరీ కార్మికుల దీర్ఘకాల డిమాండ్ వల్లనే. జీవీఎంసీ కౌన్సిల్ వాళ్ల కోసం ఏదో జీవో నంబరు 36 అని ఒక తీర్మానం చేసిందట. దాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, వాళ్లు జీవీఎంసీ ప్రధాన గేటు దగ్గర నిరసన తెలిపారు. తర్వాత జీవీఎంసీ సీపీఎం లీడర్ డాక్టర్ బి.గంగారావు, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, మేయర్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సోమవారం.. పీజీఆర్ఎస్ మనుషుల వినతులకే కాదు, మా జంతువుల ఉనికిని, మా మిత్రుల గోడును కూడా తెలియజేసింది.


శునకాలతో ఆందోళన చేస్తున్న కార్మికులు

– దాబాగార్డెన్స్

• సాగర తీరం.. అనంత సౌందర్య కావ్యం



విశాఖ సాగర తీరం ఒక అనంత సౌందర్య కావ్యం, నిత్యం సరికొత్త అందాలను ఆవిష్కరిస్తూ మనసులను మంత్రముగ్ధులను చేస్తుంది. తెలతెలవారుతూనే బంగారు వర్ణంతో మెరిసే సముద్ర కెరటాలు, కాసేపటికే వెండి కాంతులీనుతూ మనోహరంగా దర్శనమిస్తాయి. సాయంత్రం వేళ చల్లటి గాలులు పలకరిస్తూ, మేఘావృతమైన ఆకాశం కనువిందు చేస్తుంది. ఇక్కడ ప్రతి దృశ్యం ఒక కొత్త అనుభూతిని పంచుతుంది. ఉదయాన్నే సముద్ర కెరటాలతో పోటీ పడుతూ జీవన యానం ప్రారంభించే మత్స్యకారులు, సాయంత్రం కెరటాలతో సరసాలాడే యువతరం, సముద్ర కెరటాలతో సరదాగా పరుగులు తీసే గుర్రాలు..ఇవన్నీ సాగర తీరంపై కనిపించే అపురూప చిత్రాలే. సాగర తీరం కనువిందు చేస్తూ, మనసుకు అపారమైన ఆహ్లాదాన్ని పంచుతుంది. అలసిన మనసుకు ఉపశమనం అందిస్తూ, ఒత్తిడితో కూడిన ఆలోచనలకు కొత్త శక్తిని నింపుతుంది. విశాఖ సాగర తీరం కేవలం ఒక ప్రదేశం కాదు, అది మనసును సేద తీర్చే ఒక దృశ్యకావ్యం.

-ఏయూక్యాంపస్/ఫొటోలు: సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం